చెరువు పరిసరాలలో వ్యర్థాలు వేస్తే జరిమానా

● జడ్సీ మమత

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 13 : ఖాళీ ప్రదేశాలు.. చెరువు పరిసర ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం పారబోస్తే జరిమానా విధించనున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత అన్నారు. శుక్రవారం జోన్ పరిధిలోని పలు చెరువులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువులు, కుంటలతో పాటు నిర్మానుష్య ప్రదేశాలలో నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం పారబోయడం వల్ల పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతాయన్నారు. చెరువు పరిసరాలు, ఖాళీ ప్రదేశాలలో నిర్మాణ వ్యర్థాలు వేయకుండా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఖాళీ ప్రదేశాలలో చెత్తను పారబోస్తూ పట్టుబడితే రూ.500ల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం సిబ్బంది ఉన్నారు.

కూకట్‌పల్లి జోన్‌లో 'చెరువు వద్ద వ్యర్థాలు వేస్తే జరిమానా..' ఏర్పాటు చేసిన బ్యానర్

కూకట్‌పల్లి జోన్‌లో చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న జడ్సీ మమత

బతుకమ్మ వేడుకలు విజయవంతం చేయాలి

బాలానగర్‌లో బతుకమ్మ ఆడటానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, అక్టోబర్ 13 : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి రూపంగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను విజయంతం చేయాలని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని బాలానగర్ కనకదుర్గ దేవాలయం ఎదరుగా గల రోడ్డులో మహిళలు బతకమ్మ ఆడుకోవడానికి కావాల్సిన ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన మాట్లాడుతూ.. బాలానగర్ కనకదుర్గ దేవాలయం ఎదరుగా గల రోడ్డులో (గడ్డి చేను దగ్గర) ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫతేనగర్ డివిజన్‌లో..

బతుకమ్మ వేడుకల కోసం ఏర్పాటు పనులను మహిళలతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, అక్టోబర్ 13 : ఫతేనగర్ డివిజన్‌లో నిర్వహించే బతుకమ్మ పండుగ వేడుకలను జయప్రదం చేయాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శోభనకాలనీ సమీపంలోని బతుకమ్మరోడ్డులో నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాటు పనులను మహిళలతో కలిసి ఆయన పరిశీలించారు.

దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో 'మేరామాటీ-మేరాదేశ్' కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 13 : దేశం, రాష్ట్రం మనం నివసిస్తున్న పరిసరాలన్నింటినీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శుక్రవారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'మేరామాటీ-మేరాదేశ్' అన్న నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మన దేశ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని దేశంపై అభిమానాన్ని పెంచుకోవాలన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని దేశాన్ని, రాష్ట్రాన్ని, కళాశాలను, పని చేసే ఉద్యోగ సంస్థలను తమ సొంత ఆస్తులుగా భావించాలన్నారు. వీటన్నింటినీ కాపాడుకునే బాధ్యత మనందరిదని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.ప్రసన్న, యూనిట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విద్యార్థులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు

మూసాపేట, అక్టోబర్13: తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ఉత్సవాలు దోహదపడుతాయని రాడ్‌క్లిఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీమాధవి అన్నారు. బాలానగర్ రాడ్‌క్లిఫ్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రిక, ప్రధానోపాధ్యాయురాలు స్వేత, అడ్మిన్ మేనేజర్ శ్రీనివాస్, అకౌంట్ మేనేజర్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్, హెచ్‌వోడి శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలు

కూకట్‌పల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం కూకట్‌పల్లి హనుమాన్ దేవాలయం, రామాలయం ఎదుట బతుకమ్మ ఆటాపాటలతో ఆడపడచులు సందడి చేశారు. కూకట్‌పల్లి పీఎన్ఎం పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడి.. రంగధాముని చెరువులో బతుకమ్మ, గౌరమ్మను నిమజ్జనం చేశారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 13

గురుకులాల జోనల్ క్రీడలు ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 13 : విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల రంగారెడ్డి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ నాగకళ్యాణి అన్నారు. మండలంలోని అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాలలోని జగద్గిరిగుట్ట గురుకుల పాఠశాలలో 9వ జోనల్ లెవెల్ గురుకులాల క్రీడాపోటీలను శుక్రవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. 12 గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన బాలికలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ శ్రీదేవి, డీసీఓ సుధాకర్, ప్రిన్సిపాల్ ఏఆర్ లక్ష్మి, వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, పీడీలు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.